పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

దిన పత్రిక

సంపుటి : 1 సంచిక : 734 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శనివారం 3.10.2026 పేజీలు : 8 వెల : 4/-

# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

**సీఎం చంద్రబాబు**




- నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలకు సీఎం పిలుపు
- పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, అది సామాజిక బాధ్యత అని స్పష్టీకరణ
- చెత్తను సంపదగా మార్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా, గోదావరి నదులు కలుషితమయ్యాయని విమర్శ
- రాష్ట్రంలో వర్షపాత లోటుకు పారిశుద్ధ్య లోపాలు కూడా ఓ కారణమని వ్యాఖ్య

2లో



# సీమకు 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'

- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే హబ్ ప్రధాన లక్ష్యమన్న మంత్రి
- హైదరాబాద్ ఐఎస్‌బీ తరహాలో సీమలో వ్యవసాయ విప్లవం సృష్టిస్తామని ధీమా
- యువగళం పాదయాత్రలో రైతుల కష్టాలు చూశాకే 'మిషన్ రాయలసీమ' ఆలోచన
- చంద్రబాబు ముందుచూపుతోనే సీమకు జలకళ
- ఆయనే అసలైన 'వాటర్ మ్యాన్' అన్న మంత్రి లోకేశ్

4లో




## హెచ్-1బీ వీసాల రద్దుకు
# జేడీ వాన్స్ డిమాండ్

- కంపెనీలు తక్కువ జీతాలకు విదేశీయులను నియమించు కుంటున్నాయని ఆరోపణ
- ఇదిఅమెరికన్లఉద్యోగాలనునాశనంచేయడమేననివ్యాఖ్య
- భారతీయ నిపుణులు ఎక్కువగా ఆధారపడే ఈ విధానంపై ఆందోళన
- వాన్స్ వ్యాఖ్యలకు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ బహిరంగ మద్దతు

2లో

## ఉక్రెయిన్ సంక్షోభం
# మోదీపై పుతిన్ ప్రశంసలు

- యుద్ధం ముగించాలని మోదీ సూచిస్తున్నారన్న పుతిన్
- ప్రతి భేటీలో అంశాన్ని ప్రస్తావిస్తున్నారని వెల్లడి
- ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మోదీ వైఖరి తటస్థమన్న పుతిన్
- చర్చలు, దౌత్యానికే మోదీ ప్రాధాన్యమిస్తున్నారని వ్యాఖ్య




ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. మోదీకి పరస్పర అంగీకారంతో సమస్య పరిష్కరించేలా చాలా మంచి ఆలోచనలు ఉన్నాయని చెప్పారు. భారత్, రష్యా మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ.. ఉక్రెయిన్ వివాదానికి ముగింపు పలకాలని మోదీ ప్రతిసారి తనతో ప్రస్తావిస్తారని పుతిన్ తెలిపారు. మాస్కోలో గురువారం

తరువాయి 2లో

## నన్ను ఆంధ్రా బిడ్డగా
# భావించండి..

- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌తో రైతులను సీఈఓలుగా మారుస్తామన్న అనంత్
- ఏపీలో రూ.1 లక్ష కోట్లతో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న రిలయన్స్
- ఏఐ, డ్రోన్ల టెక్నాలజీతో రైతులకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని వెల్లడి
- అనంత్ ప్రసంగానికి మంత్రముగ్ధులైన నేతలు
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న సీఎం చంద్రబాబు

2లో



## పాఠశాలల్లో
# అల్పాహార పథకం

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం



2లో




# స్పేస్ పవర్‌గా భారత్

- ప్రపంచ స్పేస్ మిషన్ల గురించి 'ది గార్డియన్' ప్రత్యేక కథనం
- భారత్ ప్రపంచ స్పేస్ పవర్‌గా ఎదుగుతోందని విశ్లేషణ
- చంద్రయాన్-3తో కీలక విజయం సాధించిందని వ్యాఖ్య
- చంద్రయాన్-4తో శాంపిల్ రిటర్న్, 2028లో శుక్రయాన్ లక్ష్యాల ప్రస్తావన
- అంతరిక్ష సాంకేతికతతో పలు రంగాలకు ప్రయోజనమని వివరణ

2లో

## సరిహద్దులో బీఎస్ఎఫ్ కాల్పులు
# ఇద్దరు పాక్ చొరబాటుదారుల మృతి

- పంజాబ్ సరిహద్దులో ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులు హతం
- టార్న్ టారన్ జిల్లాలో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో కాల్పులు జరిపిన దళాలు



పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానా

తరువాయి 2లో

# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర: సీఎం చంద్రబాబు

పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన "స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు




పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దులో బీఎస్ఎఫ్ కాల్పులు
# ఇద్దరు పాక్ చొరబాటుదారుల మృతి

పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్ పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.



# నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో చారిత్రక, జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్ టాగూర్ మదనపల్లెలోనే ఆంగ్లంలోకి అనువదించారని గుర్తుచేశారు. గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ నినాదాలను, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్', వాజ్‌పేయి 'జై విజ్ఞాన్', ప్రధాని మోదీ 'జై అనుసంధాన్' నినాదాలను ఉటంకిస్తూ.. ఈ నాలుగు నినాదాల కలయికతోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని వివరించారు. టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అనంత్ ప్రకటించారు. "ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తాం. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో చెప్పే వ్యవస్థను రూపొందిస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను 'ఊర్జాదాతలు' (శక్తి ప్రదాతలు)గా మారుస్తాం" అని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవాకిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# ఉక్రెయిన్ సంక్షోభం: మోదీపై పుతిన్ ప్రశంసలు

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. మోదీకి పరస్పర అంగీకారంతో సమస్య పరిష్కరించేలా చాలా మంచి ఆలోచనలు ఉన్నాయని చెప్పారు. భారత్, రష్యా మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ.. ఉక్రెయిన్ వివాదానికి ముగింపు పలకాలని మోదీ ప్రతిసారి తనతో ప్రస్తావిస్తారని పుతిన్ తెలిపారు. మాస్కోలో గురువారం జరిగిన వాల్డాయ్ డిస్కషన్ క్లబ్ సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదాన్ని ముగించే అంశాన్ని మోదీ ప్రతి సమావేశంలోనూ లేవనెత్తుతారని చెప్పారు. శాంతియుత పరిష్కారం కోసం మోదీకి ఆసక్తి ఉందని, సమస్యకు ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ఆయన మంచి సూచనలు ఇస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో మోదీ తటస్థ వైఖరిని కొనసాగిస్తున్నారని పుతిన్ అన్నారు. అదే సమయంలో యుద్ధానికి ముగింపు రావాలన్న ఆసక్తిని స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో మోదీ చేస్తున్న ప్రయత్నాలకు రష్యా కృతజ్ఞతలు చెబుతోందని పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, పుతిన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఘర్షణలకు పరిష్కారం చూపేందుకు చర్చలు, దౌత్య మార్గమే ముందుకు వెళ్లే దారి అని మోదీ మరోసారి స్పష్టం చేశారు. శాంతి ప్రయత్నాలకు భారత్ సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. అప్పటి నుంచి మోదీ పలుమార్లు యుద్ధానికి ముగింపు పలకాలని, చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

# హెచ్-1బీ వీసాల రద్దుకు జేడీ వాన్స్ డిమాండ్

అమెరికాలో ఉద్యోగాలు చేయాలనుకుంటున్న వేలాది మంది భారతీయ నిపుణులకు ఆందోళన కలిగించే పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్1బీ వీసా విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విధానం పూర్తిగా విఫలమైందని పేర్కొన్న ఆయన, దానిని పూర్తిగా రద్దు చేయడానికి తాను మద్దతిస్తానని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు అమెరికాలో పనిచేస్తున్న, పనిచేయాలని ఆశిస్తున్న భారతీయ టెక్కీలలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఎయిర్ ఫోర్స్ టూ విమానంలో ప్రముఖ వ్యాఖ్యాత జాక్ పోసోబిక్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ కంపెనీలు, అకౌంటింగ్ సంస్థలతో పాటు ఇతర యాజమాన్యాలు ఈ వీసా విధానాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీ కార్మికులను నియమించుకోవడానికి హెచ్1బీ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణను కూడా ప్రస్తావించారు. "ఒక అమెరికన్ అకౌంటెంట్ ఏడాదికి 60,000 డాలర్ల జీతం తీసుకుంటుంటే, అతని స్థానంలో హెచ్1బీ వీసాపై వచ్చిన విదేశీయుడిని 45,000 డాలర్లకే నియమించుకుంటున్నారు. ఇది అమెరికన్ ఉద్యోగాలను నాశనం చేయడమే కాకుండా, అమెరికా ప్రజలను మోసం చేయడమే అవుతుంది" అని వాన్స్ వ్యాఖ్యానించారు. అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను దేశంలోకి తీసుకురావాలనే అసలు ఉద్దేశం దెబ్బతింటోందని ఆయన అన్నారు. ఈ విధానం అమల్లో ఉన్నంత వరకు అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వాన్స్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఈ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం అసాధ్యమని భావించిన తర్వాత, గతంలో ట్రంప్ ప్రభుత్వం కొన్ని కొత్త హెచ్1బీ పిటిషన్లపై అధిక ఫీజులు విధించే చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఫీజుల విధింపు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంది.

**భారతీయ టెక్కీలకు షాక్!**

అమెరికాలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వృత్తులలో విదేశీయులను నియమించుకోవడానికి హెచ్1బీ వీసాలు అనుమతిస్తాయి. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు ఈ వీసాలపైనే అధికంగా ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు ఉపాధ్యక్షుడి స్థాయి నుంచి దీనిని రద్దు చేయాలనే వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాన్స్ వ్యాఖ్యలకు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ బహిరంగంగా మద్దతు తెలపడం ఈ అంశానికి రాజకీయ ప్రాధాన్యతను మరింత పెంచింది. ఈ పరిణామాల నేపథ్యంలో హెచ్1బీ వీసా భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

# స్పేస్ పవర్‌గా భారత్

అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా దూసుకెళుతోంది. 1975లో ఆర్యభట్ట ప్రయోగంతో మొదలైన ప్రయాణం.. చంద్రయాన్3, ఆదిత్యఎల్1, గగన్‌యాన్ దిశగా సాగుతూ ఇప్పుడు భారతీయ అంతరిక్ష కేంద్రం వరకు చేరింది. ఈ క్రమంలో భారత్ ప్రపంచంలో కీలక అంతరిక్ష శక్తిగా ఎదుగుతోందని టాంజానియాకు చెందిన 'ది గార్డియన్' పత్రిక ఓ కథనంలో పేర్కొంది.

**చంద్రుడి నుంచి సూర్యుడి వరకు**

2023లో చంద్రయాన్3 విజయవంతంగా చంద్రుడిపై ల్యాండ్ కావడం భారత అంతరిక్ష సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది. ఆ తర్వాత ఆదిత్యఎల్1 ద్వారా సూర్యుడిపై పరిశోధనలు ప్రారంభించింది. స్పాడెక్స్ ప్రయోగంతో అంతరిక్షంలో రెండు వాహనాలను అనుసంధానం చేసే డాకింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 2024లో ఆమోదం పొందిన చంద్రయాన్4 మరింత క్లిష్టమైన మిషన్. చంద్రుడిపై దిగడం, అక్కడి నుంచి మట్టి నమూనాలను సేకరించడం, వాటిని తిరిగి భూమికి తీసుకురావడం దీని లక్ష్యం. ఇందుకోసం ఒకటి కంటే ఎక్కువ ప్రయోగాలు, డాకింగ్, చంద్రుడి ఉపరితలం నుంచి తిరిగి పైకి రావడం వంటి సంక్లిష్ట దశలు ఉంటాయి.

**శుక్రుడిపైనా భారత్ కన్ను**

భారత్ గ్రహాంతర పరిశోధనలను కూడా విస్తరిస్తోంది. శుక్రయాన్ మిషన్‌ను 2028 మార్చిలో ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. శుక్రుడి వాతావరణం, ఉపరితలం, భూగర్భ పరిస్థితులను ఈ మిషన్ అధ్యయనం చేయనుంది. మరోవైపు భూమికి సుమారు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిత్యఎల్1 సూర్యుడి కార్యకలాపాలు, అంతరిక్ష వాతావరణాన్ని పరిశీలిస్తోంది.

**గగన్‌యాన్.. మరో పెద్ద అడుగు**

భారత్ అంతరిక్ష ప్రయాణంలో గగన్‌యాన్ కీలక ప్రాజెక్టుగా మారింది. మనుషులను అంతరిక్షంలోకి పంపేందుకు అవసరమైన జీవనాధార వ్యవస్థలు, అత్యవసర రక్షణ వ్యవస్థలు, పారాచూట్లు, తిరిగి భూమికి వచ్చే సాంకేతికతను భారత్ పరీక్షిస్తోంది. ముందుగా మానవరహిత ప్రయోగాల ద్వారా కీలక వ్యవస్థలను పరీక్షించి, ఆ తర్వాత వ్యోమగాములను పంపేలా దశలవారీగా ముందుకెళుతోంది.

**అంతరిక్ష కేంద్రం.. చంద్రుడిపై మనిషి**

భారతీయ అంతరిక్ష కేంద్రం తొలి మాడ్యూల్‌ను 2028లో ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2035 నాటికి అంతరిక్ష కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్న ప్రణాళిక ఉంది. 2040 నాటికి భారత వ్యోమగామిని చంద్రుడిపైకి పంపే లక్ష్యాన్ని కూడా భారత్ నిర్దేశించుకుంది.

ఉపగ్రహాల నుంచి వ్యోమగాములు, అంతరిక్ష కేంద్రం, అక్కడి నుంచి చంద్రుడి వరకు భారత్ ప్రణాళికలు విస్తరిస్తున్నాయని కథనం పేర్కొంది.

*** భూమిపైనా అంతరిక్ష సాంకేతికత ప్రభావం**

భారత అంతరిక్ష కార్యక్రమం ప్రయోజనాలు అంతరిక్షానికే పరిమితం కావడం లేదు. వాతావరణ అంచనాలు, వ్యవసాయం, నావిగేషన్, సమాచార వ్యవస్థలు, విపత్తుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణలో ఉపగ్రహాలు కీలకంగా మారాయి. వరదలు, తుపానులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను ముందుగానే గుర్తించడంలో ఉపగ్రహ చిత్రాలు ఉపయోగపడుతున్నాయి. అడవులు, నీటి వనరులు, నగరాల విస్తరణ, కాలుష్యం, వాతావరణ మార్పులను పర్యవేక్షించడంలోనూ అంతరిక్ష డేటా ఉపయోగపడుతోంది. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు, విద్యను అందించడంలోనూ ఈ సాంకేతికత ఉపయోగపడుతోంది. అంతరిక్ష రంగంలో అభివృద్ధి చేస్తున్న ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, కమ్యూనికేషన్, నావిగేషన్, తయారీ సాంకేతికతలు ఇతర రంగాలకూ విస్తరిస్తున్నాయి.




# విద్యా విధానం - ఉపాధి

## మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు అవసరం

**“విద్య అనేది కేవలం అక్షరాల జ్ఞానం మాత్రమే కాదు, అది వ్యక్తిని ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా, సమర్థుడైన ఉద్యోగిగా తీర్చిదిద్దే ఒక శక్తివంతమైన సాధనం. ఒకప్పుడు డిగ్రీ పట్టా ఉంటే చాలు, ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వచ్చేవి. కానీ, నేటి పోటీ ప్రపంచంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిగ్రీ సర్టిఫికేట్లు అల్మారాల్లో పేరుకుపోతున్నా, పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు గల యువత కరువవుతోంది. ‘విద్యా విధానం’ మరియు ‘ఉపాధి రంగం’ మధ్య నెలకొన్న ఈ వైరుధ్యం, ప్రస్తుత విద్యా వ్యవస్థలో మనం చేస్తున్న పొరపాట్లను అద్దం పడుతోంది. మారుతున్న కాలంతో పాటు మనం మారుతున్నామా? లేక పాతబడిన పాఠ్య ప్రణాళికలతో కొత్త సవాళ్లను ఎదుర్కోలేక చతికిలబడుతున్నామా? ఈ వ్యాసం ద్వారా విద్యా, ఉపాధి రంగాల మధ్య ఉన్న ఆ అగాధాన్ని, దాన్ని పూడ్చాల్సిన ఆవశ్యకతను విశ్లేషించుకుందాం.”**

నేటి ఆధునిక యుగంలో విద్య అనేది కేవలం డిగ్రీ పట్టా సంపాదించడం మాత్రమే కాదు, అది మారుతున్న ప్రపంచంతో అడుగులో అడుగు వేస్తూ నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేసుకోవడం. అయితే, మన దేశంలోని ప్రస్తుత విద్యా వ్యవస్థకు, పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యాలకు మధ్య ఒక పెద్ద అగాధం కనిపిస్తోంది. దీనిపై సమగ్ర విశ్లేషణ:






**1. ప్రస్తుతం ఉన్న ప్రధాన సమస్యలు:**

- సైద్ధాంతిక విద్యకే ప్రాధాన్యత: మన విద్యా సంస్థలు ఇప్పటికీ పుస్తక జ్ఞానానికి (Theoretical knowledge) ఇస్తున్నంత ప్రాధాన్యతను ఆచరణాత్మక జ్ఞానానికి (Practical exposure) ఇవ్వడం లేదు. ఫలితంగా, విద్యార్థులు చదువు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగంలో చేరాక, మళ్ళీ మొదటి నుంచి శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది.
- పాతబడిన పాఠ్య ప్రణాళికలు: సాంకేతికత సెకను సెకనుకు మారుతోంది. కానీ, చాలా కళాశాలల్లో దశాబ్దాల క్రితం నాటి సిలబస్ నే బోధిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు నేటి పరిశ్రమలకు అవసరమైన ‘లేటెస్ట్ టెక్నాలజీ’పై అవగాహన పెంచుకోలేకపోతున్నారు.
- నైపుణ్యాల కొరత (Skill Gap): పరిశ్రమలు కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్, క్రిటికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటి ‘సాఫ్ట్ స్కిల్స్’ను కోరుకుంటున్నాయి. కానీ, పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు వీటిని అలవరచుకోవడానికి సమయం కేటాయించలేకపోతున్నారు.

**2. మారుతున్న ఉపాధి రంగం - ఆశిస్తున్న అర్హతలు:**

**నేటి కాలంలో కంపెనీలు కేవలం డిగ్రీ సర్టిఫికేట్‌ను చూసి ఉద్యోగం ఇవ్వడం లేదు. వారు ముఖ్యంగా చూస్తున్నవి:**



- అడాప్టబిలిటీ (Adaptability): కొత్త పరిజ్ఞానాన్ని ఎంత త్వరగా నేర్చుకోగలరు?
- టెక్నికల్ నాలెడ్జ్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డేటా అనలిటిక్స్, కోడింగ్ వంటి విభాగాల్లో ప్రాథమిక అవగాహన.
- కమ్యూనికేషన్ స్కిల్స్: తమ ఆలోచనలను స్పష్టంగా ఇతరులకు చెప్పగలగడం.

3. మనం ఏం చేయాలి? (పరిష్కార మార్గాలు):

- ఇండస్ట్రీ అకాడమియా అనుసంధానం: విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలి. నిపుణులను అతిథి అధ్యాపకులుగా పిలిపించి, పరిశ్రమలో ఏం జరుగుతుందో విద్యార్థులకు తెలియజేయాలి.
- ఇంటర్న్‌షిప్‌ల ప్రాముఖ్యత: డిగ్రీ చివరి సంవత్సరంలో మాత్రమే కాకుండా, విద్యార్థి దశలోనే ప్రతి వేసవి సెలవుల్లో ఏదో ఒక కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం లభిస్తుంది.
- స్వయం అభ్యాసం (SelfLearning): పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్స్ ద్వారా సర్టిఫికేషన్ కోర్సులను పూర్తి చేయాలి. ‘నిరంతర అభ్యాసం’ (Lifelong Learning) మాత్రమే ఉపాధిని సురక్షితం చేస్తుంది.
- ప్రభుత్వ పాత్ర: నైపుణ్యాభివృద్ధి కేంద్రాల (Skill Development Centers) ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందేలా చూడాలి.






**ముగింపు:**

విద్యార్థి బాగుంటేనే దేశం బాగుంటుంది. ప్రస్తుత విద్యా విధానం కేవలం “ఉద్యోగార్థులను” కాకుండా, “ఉద్యోగ సృష్టికర్తలను” (Job Creators) తయారు చేసే దిశగా అడుగులు వేయాలి. అలాగే, విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న విద్యకు, బయట ఉన్న ఉపాధి అవకాశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించి, తమను తాము నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలి. డిగ్రీ పట్టా అనేది ఒక పునాది మాత్రమే, దానిపై మనం నిర్మించుకునే నైపుణ్యాల సౌధమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# చరిత్రలో ఈ రోజు

## అక్టోబర్ 3

October 3

- 1923 : బ్రిటిషు సామ్రాజ్యములో పట్టభద్రురాలైన తొట్టతొలి వనితలలో ఒకరు, స్త్రీవిమోచన కార్యకర్త కాదంబినీ గంగూలీ మరణం (జ.1861). (చిత్రంలో)
- 1957 : ఆకాశవాణి విశిష్ట సేవ వివిధ భారతి ప్రారంభం.
- 1990 : బెర్లిన్ గోడ తొలగింపుతో జర్మనీ విలీనం జరిగినది.
- 1992 : చరిత్ర పరిశోధకులు, రచయిత, న్యాయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు దిగవల్లి వేంకటశివరావు మరణం (జ.1898).



కాదంబినీ గంగూలీ

- 2006 : తమిళ, తెలుగు సినిమా నటి, నాట్య కళాకారిణి ఇ.వి. సరోజ మరణం (జ.1935).



# విశాఖ బీచ్‌లో ముగ్గురు విద్యార్థుల గల్లంతు

పీఎంపాలెం: విశాఖ జిల్లా రుషికొండ ఐటీహిల్స్ సమీపంలోని సముద్ర తీరంలో ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం సెలవు దినం కావడంతో ఆరుగురు విద్యార్థులు సముద్రంలో ఈతకు దిగారు. వారిలో మధురవాడలోని మల్లయ్యపాలెంకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎస్.సూర్యప్రకాశ్(14), నితీశ్(15), ప్రశాంత్(14) నీటిలో మునిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న మెరైన్, పీఎం పాలెం పోలీసులు, లైఫ్ గార్డు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

# ఏపీలో 70 మంది వైద్యులకు

## ఉద్వాసన.. ప్రభుత్వం ఆదేశాలు

అమరావతి: విధులకు తరచూ గైర్హాజరవుతున్న 70 మంది వైద్యులకు ఏపీ ప్రభుత్వం ఉద్వాసన పలికింది. వీరేకాక వివిధ దశల్లో మరో 193 మంది పైనా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. మే నెలలోనే డీఎంఈ పరిధిలో 51 మంది వైద్యులను తొలగించారు. వైద్యుల గైర్హాజరును ఉపేక్షించవద్దని అధికారులకు మంత్రి సత్యకుమార్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. డీఎంఈ, డీఎస్‌హెచ్‌ఎస్‌లు తమ నివేదికను మంత్రికి అందజేశారు. దీంతో సుదీర్ఘకాలంగా అనధికారికంగా గైర్హాజరవుతున్న వైద్యులపై ప్రభుత్వం వేటు వేసింది.



# గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల

## చెత్త వదిలింది: మంత్రి నారాయణ

- **నెల్లూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ**
- **ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు హామీ**
- **కాలేజీలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘స్వచ్ఛ భారత్ స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమానికి ప్రజలందరి సహకారం అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించి, ఆధునిక క్రికెట్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా ఒక రోజు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. “గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించింది. గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే, మేం వాటన్నింటినీ క్లియర్ చేస్తున్నాం” అని ఆరోపించారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. పట్టాల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం పేదలకు శాశ్వత నివాస పత్రాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు.

# యూపీఐ లావాదేవీలపై టారిఫ్‌లు విధించడం ప్రజా వ్యతిరేకం: ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి

జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి సందర్భంగా సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "భారత ప్రభుత్వం ప్రతిపాదించిన UPI లావాదేవీలపై టారిఫ్ లు" అంశంపై చర్చా గోష్టి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి , ప్రఖ్యాత ఆర్థికవేత ,మాజీ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ మరియు డీన్ ,సోషల్ సైన్సెస్ స్కూల్ హైదరాబాద్ విశ్వవిద్యాలయం పాల్గొన్నారు. మాస్టర్ కార్డ్, వీసా వంటి సంస్థలు యూపీఐ చెల్లింపుల వల్ల నష్టపోతున్నాయని భారత్ అమెరికా వ్యాపార చర్చల సందర్భంగా అమెరికా లేవనెత్తడం వల్ల భారత ప్రభుత్వం రూ.2 వేల పైబడిన యూపీఐ చెల్లింపులపై 0.4% పన్ను విధించడం ప్రజా వ్యతిరేక చర్యగా ప్రొఫెసర్ నరసింహారెడ్డి వర్ణించారు. భారతదేశంలో చలామణిలో ఉన్న యూపీఐ విధానం వల్ల ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. 11 దేశాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. యూపిఐ వాడకం వల్ల సంవత్సరానికి 314 లక్షల కోట్ల రూపాయలు టర్నోవర్ జరుగుతున్నది. అందువల్ల కరెన్సీ ముద్రణ వ్యయం రూ. 57 వేల కోట్ల రూపాయల ఆదాయం ఉన్నట్లు ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. మొత్తం లావాదేవీల్లో రూ .2 వేల లోపు లావాదేవీల్లో 95% ఉన్న వాటి విలువ మొత్తం టర్నోవర్ లో 20 శాతానికి లోబడే ఉంది. 80% టర్నోవర్ పై పన్ను విధించే అవకాశం ఉంది. దానిని వాణిజ్య సంస్థలు భరిస్తాయని చెబుతున్న అంతిమంగా అది వినియోధారు లపై పడవచ్చని అభిప్రాయపడ్డారు. సి ఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ గారు ఈ చర్చా గోష్టికి అధ్యక్షత వహించారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా, వృద్ధాశ్రమ స్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సి ఆర్ ఫౌండేషన్ ఈ చర్చా గోష్టి ని ఏర్పాటు చేసింది.





తొలుత వృద్ధాశ్రమంలో భారత జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి సందర్భంగా హైదరాబాద్ కొండాపూర్ లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ లో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. సి ఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ, మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు ఆకాంక్షలకు అనుగుణంగా 1999 అక్టోబర్ 2వ తేదీన సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రాజకీయాలకు అతీతంగా మహాత్మా గాంధీ జయంతినాడు, వృద్ధాశ్రమం ప్రారంభించు కొని నేటికి 27 సంవత్సరాలు అయిందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కే రజని, సి ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కంభం పాటి అజయ్ కుమార్, ఫౌండేషన్ ట్రెజరర్ చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, మహిళా సంక్షేమ కేంద్ర సభ్యురాలు వి. లలిత, నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ సభ్యులు కనపర్తి జ్యోస్న, రాజగోపాల్ రెడ్డి, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఎన్ రాజేంద్ర రావు, ఐదు కళ్ళు అరుణకుమారి, వృద్ధాశ్రమ మేనేజర్ శ్రీనివాస్, ఆశ్రమ వాసులు, తదితరులు పాల్గొన్నారు

## కన్నీటి వీడ్కోలు నడుమ
# భగవాన్ మహా సమాధి

వరదయ్యపాళెం : ఆధ్యాత్మిక గురువు, వన్నెస్(ఏకం) సంస్థ వ్యవస్థాపకుడు కల్కి భగవాన్(విజయ్‌కుమార్ అంతిమయాత్ర.. భక్త జనసందోహం కన్నీటి వీడ్కోలు నడుమ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగింది. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబరు 29వ తేదీన కల్కి భగవాన్ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తులవల్లంలోని ఏకం క్షేత్రంలో మూడు రోజుల



పాటు ఆయన పార్థివదేహాన్ని సందర్శనార్థం ఉంచారు. శుక్రవారం జరిగిన మహా సమాధి అంతిమయాత్రలో ప్రభుత్వ ప్రతినిధిగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు. భగవాన్ కుమారుడు కృష్ణాజీ, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి.. భగవాన్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. భక్తుల కన్నీటి నీరాజనాలు, భగవాన్ నామ స్మరణ నడుమ ఆయన పార్థివదేహాన్ని మహా సమాధి చేశారు.

# కుమారుడు వాయువ్‌తో శ్రీవారి సేవలో వరుణ్ తేజ్, లావణ్య

- **తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వరుణ్ తేజ్, లావణ్య**
- **కుమారుడు వాయువ్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు**
- **కుమారుడిని ఎత్తుకుని ఆలయ ప్రాంగణంలో కనిపించిన వరుణ్**
- **ప్రస్తుతం 'భారీ' అనే స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్న వరుణ్**
- **ఈ సినిమాకు ఆయన సోదరి నిహారిక నిర్మాత**



ప్రముఖ టాలీవుడ్ నటుడు, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కొణిదెల శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన అర్ధాంగి లావణ్య త్రిపాఠి, కుమారుడు వాయువ్‌తో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తన చిన్న కుమారుడిని ఎత్తుకుని వరుణ్ తేజ్ వెళుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వరుణ్ తేజ్ తల్లిదండ్రులు నాగబాబు, పద్మజ, సోదరి నిహారిక కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవలే సెప్టెంబర్ నెలలో తమ కుమారుడు వాయువ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా వరుణ్, లావణ్య దంపతులు తమ చిన్నారి ఫొటోలను అభిమానులతో పంచుకున్న విషయం తెలిసిందే. "నా ప్రపంచాన్ని మార్చేశావు" అంటూ వరుణ్ తన కుమారుడిపై ప్రేమను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఇప్పుడు కుటుంబ సమేతంగా తిరుమల రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక వరుణ్ తేజ్ కెరీర్ విషయానికొస్తే, ప్రస్తుతం ఆయన 'కమిటీ కుర్రోళ్ళు' ఫేమ్ యధు వంశీ దర్శకత్వంలో 'బరి' అనే చిత్రంలో నటిస్తున్నారు. గ్రామీణ క్రీడా నేపథ్యంతో, వాలీబాల్ ఆట చుట్టూ ఈ సినిమా కథ సాగనున్నట్లు గతంలో విడుదల చేసిన మోషన్ పోస్టర్ స్పష్టం చేసింది. ఈ చిత్రాన్ని పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై వరుణ్ సోదరి నిహారిక కొణిదెల నిర్మిస్తుండటం విశేషం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తుండగా, డానిష్ భాస్కర్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.



## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..
# వాయుగుండంగా మారే చాన్స్

- **బంగాళాఖాతంలో మరో అల్పపీడనం**
- **అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం**
- **వివరాలు వెల్లడించిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ**
- **ఈ సీజన్‌లో ఏపీలో 34.9 శాతం మేర వర్షపాతం లోటు**

నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## ప్రభుత్వానికి ఏపీ ఎన్జీవోల కృతజ్ఞతలు..
# 25 రోజుల్లోనే హామీల అమలుపై హర్షం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏపీ ఎన్జీవో సంఘం హర్షం వ్యక్తం చేసింది. కేవలం 25 రోజుల్లోనే కీలక హామీలను నెరవేరుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలతో కలిపి రెండు డీఏలను ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌గా మాజీ సీఎస్ దినేశ్ కుమార్‌ను నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయడం, పెన్షనర్లకు డిసెంబర్ 1 నుంచి అదనపు క్వాంటమ్ పెన్షన్ వర్తింపజేయడం సంతోషకరమని అన్నారు.ఆరోగ్య కార్డుల సమస్య పరిష్కారానికి నెలకు రూ.36 కోట్ల నుంచి రూ.40 కోట్లు నేరుగా ట్రస్ట్‌కు జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విద్యాసాగర్ వివరించారు. ఆరోగ్య కార్డు నిధులు నేరుగా ట్రస్ట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవడం గత పదేళ్లలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

# రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్

- **రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ**
- **మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు**
- **రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్**

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని



లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీమకు 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్': మంత్రి లోకేశ్




ఒకప్పుడు హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఎలాంటి అద్భుతాన్ని సృష్టించిందో, ఇప్పుడు అలాంటిదే రాయలసీమలో ఆవిష్కృతం కాబోతోందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మదనపల్లెలో ఏర్పాటు చేయబోతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (జీహెచ్‌హెచ్), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్‌ఏ) ఈ ప్రాంత వ్యవసాయ రంగ రూపురేఖలను సమూలంగా మార్చేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మదనపల్లెలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక సంస్థల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "విత్తనం నుంచి ప్రపంచ స్థాయి ఉత్పత్తుల వరకు అన్ని దశల్లోనూ ఇక్కడ పరిశోధనలు జరుగుతాయి. ఉత్పాదకత, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యాంత్రీకరణ, జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై దృష్టి సారిస్తాం. మన రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఈ హబ్ ప్రధాన లక్ష్యం. కేవలం ఇతర రాష్ట్రాలకు కాదు, ఇతర దేశాల మార్కెట్లకు అవసరమైన మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి మేలైన వంగడాలను పండించి, రాయలసీమ రైతు సత్తాను ప్రపంచానికి చాటి చెబుతాం" అని స్పష్టం చేశారు.

*** యువగళం నుంచే 'మిషన్ రాయలసీమ' పుట్టింది**

యువగళం పాదయాత్రలో తాను 124 రోజుల పాటు రాయలసీమలో పర్యటించినప్పుడు రైతుల కష్టాలను కళ్లారా చూశానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "నాపై సోడా బాటిళ్లు, రాళ్లతో దాడులు చేసినా వెనక్కి తగ్గకుండా 1,587 కిలోమీటర్లు నడిచాను. ప్రతి రోజూ రైతులతో మాట్లాడి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నాను. ఆ అనుభవంతోనే 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ' ప్రకటించాను. అందులో ప్రధానమైనదే ఈ హార్టికల్చర్ హబ్. ఆనాటి కల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు సహకారంతో ఈరోజు నిజమవుతోంది" అని వివరించారు.

**చంద్రబాబే అసలైన 'వాటర్ మ్యాన్'**

రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబుకు రైతుల కష్టాలు బాగా తెలుసని లోకేశ్ అన్నారు. "ఈ మధ్య ఒక ఆంగ్ల పత్రిక చంద్రబాబును 'వాటర్ మ్యాన్' అని అభివర్ణించింది. అది చూసి గొడ్డలి పార్టీ నేతలు ఏడుస్తున్నారు. సీమ రైతులకు వరంలాంటి డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీని ఎత్తేసింది ఎవరు? పట్టిసీమతో ప్రయోజనం లేదన్నది ఎవరు? పోలవరం అర్థం కాలేదన్నది ఎవరు? అని నేను వారిని ప్రశ్నిస్తున్నాను. 1997లోనే ఇజ్రాయెల్ టెక్నాలజీతో సీమకు బిందు సేద్యాన్ని పరిచయం చేసి, కరవు నేలను సస్యశ్యామలం చేసిన ఘనత చంద్రబాబుది. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరునగరి వంటి ప్రాజెక్టులను దేవాలయాల్లా భావించి పూర్తి చేసే సంకల్పం ఆయనది. అందుకే ఆయన్ను అందరూ వాటర్ మ్యాన్ అంటున్నారు" అని లోకేశ్ పేర్కొన్నారు.

**ఐఎస్‌బీ స్ఫూర్తితో ఐఎస్‌ఏ**

చంద్రబాబు ముందుచూపునకు ఐఎస్‌బీ నిలువెత్తు నిదర్శనమని లోకేశ్ అన్నారు. "దేశంలోని పారిశ్రామికవేత్తలు వరల్డ్ క్లాస్ బిజినెస్ స్కూల్ పెట్టాలనుకున్నప్పుడు, వారి ఆలోచనలో ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి రాష్ట్రం) లేకపోయినా, చంద్రబాబు పట్టుదలతో వారిని ఒప్పించి హైదరాబాద్‌కు ఐఎస్‌బీని తీసుకొచ్చారు. స్వయంగా ప్రజెంటేషన్ ఇచ్చి, వారిని మెప్పించారు. ఆ ఐఎస్‌బీ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ సంస్థల్లో ఒకటిగా నిలిచింది. అదే స్ఫూర్తితో, అంబానీ కుటుంబం వంటి వారి సహకారంతో ఈ ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్‌ఏ) కూడా మన రైతుల కోసం ప్రపంచ స్థాయి సంస్థగా ఎదుగుతుంది" అని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మదనపల్లె చారిత్రక ప్రాధాన్యతను, 'జన గణ మన' గీతానికి ఇక్కడి బీటీ కాలేజీలో ఆంగ్లానువాదం జరగడాన్ని గుర్తుచేస్తూ, ఇంతటి గొప్ప గడ్డపై ఈ బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు.

# ఒక మహిళ ఇంటిని ఎలా చక్కదిద్దుతుందో, దేశాన్ని నిర్మల అలా తీర్చిదిద్దుతున్నారు

- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- హాజరైన కేంద్ర మంత్రి నిర్మల, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, అనంత్ అంబానీ
- రూ.లక్ష కోట్ల భారీ అంచనా వ్యయంతో రూపుదిద్దుకోనున్న ప్రాజెక్టు
- నిర్మలా సీతారామన్‌ను ఉక్కు మహిళగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

















కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక 'ఉక్కు మహిళ' అని, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలతో ముంచెత్తారు. ఓ మహిళ ఇంటిని ఎంత చక్కగా తీర్చిదిద్దగలదో, అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలు అప్పగించారని చంద్రబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (GHH), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ISA) శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి నెక్స్ట్ జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత తీసుకురావడం ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఘనత నిర్మలా సీతారామన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వ సహకారమే కారణమని స్పష్టం చేశారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. ముఖ్యంగా, మదనపల్లెలో ఏర్పాటు కానున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం నిధుల కేటాయింపులో నిర్మలా సీతారామన్ చూపిన చొరవ, అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

**లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్**

ఇవాళ, మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## జేపీలో చేరిన సీరియల్ నటులు..
# ఆహ్వానించిన రాంచందర్ రావు

- బీజేపీలో చేరిన స్వర్ణలత తదితర నటులు
- సామాన్యులను కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్టించుకోవడం లేదని రాంచందర్ రావు విమర్శ
- రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని వ్యాఖ్య



తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వినోద రంగంలోని ప్రముఖులను చేర్చుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చేరికలు జరిగాయి.

## కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి
# చెమటలు పట్టిస్తాం: తలసాని

- కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ పెడతామన్న తలసాని
- సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్న
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు.. 12 ఏళ్ల తర్వాత పెంపు

- తెలంగాణలో 12 ఏళ్ల తర్వాత సవరించిన ఆటో ఛార్జీలు
- కనీస ఛార్జీ రూ. 30, ఆ తర్వాత కిలోమీటరుకు రూ. 14గా నిర్ధారణ
- రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఒకటిన్నర రెట్లు అధిక ఛార్జీ
- మూడు నెలల్లో మీటర్లు మార్చాలని డ్రైవర్లకు ఆదేశాలు
- పెరిగిన ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వ కమిటీ సిఫారసులతో నిర్ణయం




తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీల ప్రకారం, కనీస ఛార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు. వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఛార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

# గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# జంతర్ మంతర్ వద్ద పోలీస్ బస్సును అడ్డుకున్న మహిళ.. రియా అహిర్‌ను గుర్తుచేసిన నెటిజన్లు

- జంతర్ మంతర్ వద్ద పోలీస్ బస్సును అడ్డుకున్న మహిళ
- నిరసనకారులను తీసుకెళుతుండగా ఘటన
- మోడల్ రియా అహిర్‌ను అనుకరించిందంటూ సోషల్ మీడియాలో చర్చ
- గత జులైలో ముంబైలో ఇలాగే బస్సును అడ్డుకున్న రియా అహిర్



న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక మహిళ పోలీస్ బస్సును అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు, కొన్ని నెలల క్రితం ముంబైలో మోడల్ రియా అహిర్ చేసిన చర్యతో దీనిని పోలుస్తూ రకరకాలుగా స్పందిస్తున్నారు. నిరసనకారులను అదుపులోకి తీసుకుని బస్సులో తరలిస్తున్న క్రమంలో, సదరు మహిళ ఆ వాహనానికి అడ్డుగా నిలబడింది. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ మహిళా పోలీసులు ఎవరూ లేరని 'ఎక్స్' వేదికగా వెలువడిన ఒక పోస్ట్ ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. గత జులై 2026లో ముంబైలో జరిగిన నిరసనల సందర్భంగా, విద్యార్థులను తరలిస్తున్న పోలీస్ వ్యాన్‌ను రియా అహిర్ (రియా ఇకౌసియా) అడ్డుకున్నారు. వర్షంలో తడుస్తూనే సుమారు 40 నిమిషాల పాటు వాహనాన్ని ముందుకు కదలనివ్వకుండా ఆమె నిలువరించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనతో ఆమె సోషల్ మీడియాలో విశేష గుర్తింపు పొందారు. తాజాగా జంతర్ మంతర్ వద్ద చోటుచేసుకున్న ఘటన కూడా అదే తరహాలో ఉండటంతో, కేవలం ప్రచారం కోసమే ఈ మహిళ రియా అహిర్‌ను అనుకరించి ఉండవచ్చని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ మహిళ ఎవరు, ఆమె ఉద్దేశం ఏంటి అనే విషయాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు కూడా ఇంకా తెలియరాలేదు.

# హనుమాన్ చాలీసా చదివి ధైర్యం తెచ్చుకున్నా.. మోదీతో వీడియోకాల్‌లో స్మిత్ భావోద్వేగం

ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో పరామర్శించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న మచ్చర్‌తో మోదీ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన అరోగ్య పరిస్థితి గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాక్‌పిట్‌లో తనకు ఎదురైన విపత్కర పరిస్థితి గురించి మోదీకి కెప్టెన్ స్మిత్ వివరించారు. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో మీరు చూపించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. మీరు కోలుకోవాలని యావత్ భారతావని ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు.. ఇతరులను రక్షించడం కోసం తమ సొంత ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం గర్వంగా చెప్పగలదు'' అని స్మిత్‌తో మాట్లాడుతూ మోదీ ఆయనను ప్రశంసించారు. మోదీ నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. "మీరు నాకు అత్యంత ఆరాధ్యమైన వ్యక్తి. మీ నుంచి కాల్ రావడం చాలా ప్రత్యేకంగా, గర్వంగా ఉంది. ఇది నేను కలలో కూడా ఊహించని క్షణం. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు నేను హనుమాన్ చాలీసాను పఠిస్తాను. కాక్‌పిట్‌లో ఘర్షణ సమయంలోనూ దాన్నే జపించా. ఆ సమయంలో నేను గాయపడినా దాని గురించి ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి..




లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని అర్థం చేసుకున్నా'' అని ప్రధానికి తెలిపారు. అంతకుముందు స్మిత్ కుటుంబసభ్యులతో మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం స్మిత్ యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అక్కడి భారత దౌత్యకార్యాలయం వెల్లడించింది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో ఈ దాడి ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కెప్టెన్ స్మిత్‌పై కోపైలట్ దాడి చేసి ఆయనను తీవ్రంగా గాయపర్చారు. కత్తిపోట్లతో శరీరం నుంచి రక్తం ధారగా కారుతున్నా.. విమానం కూలకుండా చూసి ఎంతోమంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడగలిగారు స్మిత్. దీంతో ఆయనపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన హీరో అని, 9/11 లాంటి మారణహోమాన్ని నివారించారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కొనియాడారు.

## అంతమాత్రాన మామను బాధ్యుడిని చేయలేం
# గృహ హింస కేసుపై ఢిల్లీ హైకోర్టు

తన కుమారుడి ప్రవర్తనను నియంత్రించనంత మాత్రాన మామను గృహ హింస చట్టం కింద బాధ్యుడిని చేయలేమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. తన మామపై చేసిన గృహ హింస ఆరోపణల విషయంలో విచారణను కొనసాగించలేమంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీకి చెందిన ఓ మహిళ తన భర్త, మామతో కలిసి ఉండేది. తమకు పిల్లలు పుట్టకపోవడంతో ఓ పాపను దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. 2017 2019 సమయంలో వ్యాపారం




విషయంలో భర్త, మామ తనను బెదిరింపులకు పాల్పడ్డాడని ఆమె పిటిషన్‌లో పేర్కొంది. తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నప్పటికీ మామ అతడిని ఏమీ అనలేదని ఆరోపించింది. దీనిపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు ఓ వ్యక్తి తప్పుడు ప్రవర్తనకు అతడి తండ్రిని బాధ్యుడిని చేయడం సరికాదని పేర్కొంది. కోడలిపై ఎటువంటి హింసకు పాల్పడకపోయినా.. కేవలం తన కుమారుడి ప్రవర్తనను తప్పుబట్టనందున మామను గృహ హింస చట్టం కింద బాధ్యుడిని చేయలేమని స్పష్టం చేసింది. అవమానించారు, అరిచారు, దూషించారు అనే ఫిర్యాదులకు తగిన ఆధారాలు లేకుండా చర్యలు తీసుకోబోమని తెలిపింది.

# శాంతి దిశగా భారత్ ప్రపంచానికి మార్గం చూపించింది: మోహన్ భాగవత్

శాంతి, శ్రేయస్సు దిశగా భారత్ ప్రపంచానికి మార్గం చూపించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో దేశం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అభివృద్ధిపర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛకుటుంబ జీవనం, మత విశ్వాసాలుసంఘర్షణల మధ్య ఉన్న వైరుధ్యాలతో ప్రపంచ దేశాలు సతమతమవుతున్నాయన్నారు. వాటికి దిశానిర్దేశం చేసే శక్తి భారత్‌కు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ముంబయిలో ఓ యువజన సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మాట్లాడారు. 'అభివృద్ధి పెరిగేకొద్దీ పర్యావరణం



దెబ్బతింటుంది. అలాగే పర్యావరణాన్ని రక్షించాల్సిన చోట అభివృద్ధి జరగదు. వ్యక్తిగత స్వేచ్ఛ పెరిగేకొద్దీ.. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఒకదానిని వదులుకుని.. మరోదానిని ఎంచుకోవడం ద్వారా ప్రపంచంలోని సంఘర్షణలను పరిష్కరించలేం. ఇందుకోసం వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ, మహాభారతాలు, సాధువుల బోధనల నుంచి భారత్‌కు వచ్చిన జ్ఞానం ప్రపంచానికి చాలా అవసరం. మన దేశం, ధర్మం వేర్వేరు కావు. దేశాన్ని నిలబెట్టడంలో ధర్మం సహాయపడుతుంది. దేశం బలహీనపడితే ధర్మానికి ముప్పు వాటిల్లుతుంది. ఆ రెండింటినీ ముందుకు తీసుకువెళ్లడమే మన బాధ్యత. ఏ దేశంపై దాడి చేయకుండా.. ఎవరినీ తన నియంత్రణలోకి తీసుకోకుండా భారత్ ఎన్నో ఏళ్లుగా శాంతి, సంతోషాలతో ముందుకు వెళ్తోంది' అని భాగవత్ పేర్కొన్నారు.

# 'సర్'తో ఓటు పోయిందా..? ఆ రాష్ట్రాల్లో ఈసీ ప్రత్యేక డ్రైవ్..!

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే (సర్)తో పెద్దఎత్తున ఓట్లు గల్లంతయ్యాయంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అటు విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ ఈసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన అర్హులైన ఓటర్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. వీరితో పాటు కొత్త ఓటర్ల నమోదు కూడా చేపట్టనుంది. ఈ మేరకు సర్ ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ ముగిసింది. ఈ ప్రక్రియ సమయంలో ఏ వ్యక్తి పేరు అయినా జాబితా నుంచి తొలగిపోయినా.. లేదంటే యువ ఓటర్లు తమ ఓటుహక్కు పొందాలన్నా.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా తమ పేర్లను ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇలాంటి ఓటర్ల నమోదు కోసం ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులు తక్షణమే ప్రత్యేక డ్రైవ్ చేపడతారు'' అని ఈసీ తమ మీడియా ప్రకటనలో వెల్లడించింది. ఫారమ్6 ఉపయోగించి అర్హత కలిగిన ఓటర్లు తమ పేర్లను ఎన్నికల జాబితాలో నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ తెలిపింది. ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించినట్లు పేర్కొంది. సర్‌కు ముందున్న ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను సరిపోల్చాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఎవరి పేర్లను తొలగించారన్న లిస్ట్ సిద్ధం చేసి..




అందులో అర్హత కలిగిన ఓటర్లు ఎవరైనా ఉన్నారో లేదో గుర్తించాలని తెలిపింది. వారి చేత ఫారమ్ 6ను పూర్తి చేయించాలని ఈసీ ఆదేశించినట్లు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. సర్ ప్రక్రియతో దాదాపు 13 కోట్ల మంది పేర్లను ఓటరు ముసాయిదా జాబితా నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఈసీ ఓట్లను తొలగిస్తోందని విపక్షాలు మండిపడ్డాయి. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది.



## ముంబయిలో CJP ఆందోళన..
# పలువురు ప్రముఖుల సంఘీభావం

ముంబయి: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ముంబయిలో ఆందోళన చేపట్టింది. శివాజీ పార్క్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ.. భారీ సంఖ్యలో యువత హాజరయ్యారు. నిరసన జరిగే ప్రాంతానికి దగ్గర్లోని దాదర్ రైల్వేస్టేషన్, సెంట్రల్ ముంబయి ప్రాంతాల్లో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది మోహరించినప్పటికీ.. పెద్దఎత్తున నిరసనకారులు శివాజీ పార్క్‌కు చేరుకున్నారు. 'జ్ఞానేశ్ బ్రో, జస్ట్ రిజైన్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వంటి విద్యార్థి సంఘాల ప్రతినిధులతో పాటు సీనియర్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, గాయకుడు విశాల్ దద్లానీ, గాంధీ మునిమనువడు, సామాజిక కార్యకర్త తుషార్ గాంధీ సహా పలువురు ప్రముఖులు ఈ ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నీట్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన రెండు నెలల వ్యవధిలోనే మరోసారి ఆందోళనకు దిగాల్సిన పరిస్థితులు మోదీ హయాంలో నెలకొన్నాయని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. ధైర్యం ఉంటే నిరసనకారులను జైల్లో పెట్టండి అంటూ మహారాష్ట్ర సర్కారుకు సవాలు విసిరారు. మరోవైపు, శివసేన యూబీటీ, మహారాష్ట్ర నవనిర్మాణ సేన సీజేపీ ఆందోళనకు మద్దతు ప్రకటించాయి. శాంతిభద్రతల కోణంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

# పట్టాలెక్కనున్న మరో వందేభారత్ స్లీపర్.. ఏపీలో ఈ స్టేషన్ల మీదుగా!

సుదూర ప్రయాణాలు చేసే ప్రయాణికుల కోసం ఉద్దేశించిన వందేభారత్ స్లీపర్ రైలు (Vande Bharat Sleeper) మరో మార్గంలో త్వరలో అందుబాటులోకి రానుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి, టెక్నాలజీ రాజధానిగా గుర్తింపు పొందిన బెంగళూరు మధ్య రెండో వందేభారత్ స్లీపర్ రైలు సేవలందించనుంది. దసరా కానుకగా ఈ రైలు సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కొత్త రైలుకు రైల్వే బోర్డు ఆమోదం తెలపగా.. ప్రారంభ తేదీపై త్వరలోనే స్పష్టత రానుంది. ముంబయి బెంగళూరు వందేభారత్ స్లీపర్ రైలు వారానికి ఆరు రోజులు నడవనుంది. బెంగళూరు నుంచి సోమవారం మినహా, ముంబయి నుంచి మంగళవారం మినహా ఈ రైలు ప్రయాణికులకు సేవలందించనుంది. ప్రతి రోజూ రాత్రి 10 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు ముంబయి చేరుకుంటుంది. ముంబయి నుంచి రాత్రి 10.30 గంటలకు బయల్దేరే ఈ స్లీపర్ రైలు మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు బెంగళూరు చేరుతుంది. మొత్తం 16 గంటల సమయం పడుతుంది.

ఆగే స్టేషన్లు ఇవే: బెంగళూరు ముంబయి వందేభారత్ స్లీపర్ రైలు మార్గమధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో ఆగుతుంది. వీటితో పాటు రాయచూర్, కలబురగి, సోలాపూర్, పుణె, కల్యాణ్ స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. ప్రస్తుతం ముంబయి బెంగళూరు



నగరాల మధ్య ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుండగా.. దాదాపు 22 గంటల ప్రయాణ సమయం పడుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలు ఈ ఏడాది జనవరిలో అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే.

## ఆ కోపైలట్‌ను ఎవరైనా పంపి ఉంటే ప్రతీకారం తప్పదు నెతన్యాహు వార్నింగ్

ఫ్లైదుబాయ్ విమానంలో దాడికి పాల్పడిన కోపైలట్ ఇస్లామిక్ తీవ్రవాద భావజాలానికి లోనయ్యాడని, విమానాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించినట్లు స్పష్టమవుతోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు (Ben jamin Netanyahu) ఉద్ఘాటించారు. అయితే, అతడిని ఎవరైనా పంపారా? లేదా సొంత నిర్ణయంతో దాడికి పాల్పడ్డాడా? అనే విషయంపై దర్యాప్తు జరుగుతోందన్నారు. ఒకవేళ ఎవరైనా ఆదేశాల మేరకు అలా చేసి ఉంటే మాత్రం.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. అతడిని పంపిన వారు భారీ



మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. "దాడికి పాల్పడిన కోపైలట్‌ను విచారిస్తున్నారు. ఇజ్రాయెల్ దర్యాప్తు అధికారులు కూడా విచారణ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇప్పటివరకు తెలిసిన సమాచారం ప్రకారం నిందితుడు తీవ్రవాద భావజాలానికి లోనైనట్లు తెలుస్తోంది. అతడు ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది'' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఫ్లైదుబాయ్ విమానంలో కోపైలట్ దాడికి పాల్పడి కూల్చేందుకు ప్రయత్నించగా.. భారత్‌కు చెందిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా ప్రతిఘటించి 174 మంది ప్రాణాలను కాపాడిన విషయం తెలిసిందే.

# ఇజ్రాయెల్‌కు హైజాక్ కొత్తేమీ కాదు.. నాడు నెతన్యాహు సోదరుడే హీరో!

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న హింసాత్మక దాడితో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. ఈ అనూహ్య ఘటనతో ఇజ్రాయెల్ పౌరుల మదిలో మరోసారి 'హైజాక్' భయాలు వణుకు పుట్టించాయి. ఈ దేశవాసులను లక్ష్యంగా చేసుకుని గతంలో పలుమార్లు హైజాక్ ఘటనలు చోటుచేసుకున్నాయి. అందులో ఒకటి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు జీవితాన్నే మార్చేసింది. యాభై ఏళ్ల క్రితం హైజాకర్ల చెరలో ఉన్న 100 మంది బందీలను కాపాడేందుకు.. ఇజ్రాయెల్ సైన్యం 4 వేల కిలోమీటర్లు దాటి సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టింది. నాటి పోరులో నెతన్యాహు తన అన్నను కోల్పోయారు.

### హైజాకర్లను స్వాగతించిన దేశాధ్యక్షుడు..

అది 1976 జూన్ 27.. టెల్ అవీవ్ నుంచి పారిస్ బయల్దేరిన ఎయిర్‌ఫ్రాన్స్ 139 విమానం ఏథెన్స్‌లో ఆగింది. అక్కడి నుంచి టేకాఫ్ అయిన కాసేపటికి విమానంలో ఉన్న ఉగ్రవాదులు దాన్ని హైజాక్ చేశారు. ఆ సమయంలో విమానంలో దాదాపు 250 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ఉగ్రవాదులు ఆ విమానాన్ని ఉగాండా



రాజధాని కంపాలాకు సమీపంలో ఉన్న ఎంటెబె ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లారు. ఈ హైజాక్‌కు ఉగాండా ప్రభుత్వం సహకరించడం గమనార్హం. స్వయంగా నాటి అధ్యక్షుడు ఐడీ అమీన్.. హైజాకర్లకు స్వాగతం పలికారట. అంతేకాదు ఉగాండా సైన్యం ఎయిర్‌పోర్టులో పహారా కాసింది.

### వారం పాటు హైజాకర్ల చెరలో..

ఇజ్రాయెల్ సహా పలు దేశాల్లో ఉన్న తమ పాలస్తీనా ఖైదీలను విడిపించుకునేందుకు ఉగ్రవాదులు ఈ హైజాక్‌కు పాల్పడ్డారు. తొలుత విమానంలోని ఇజ్రాయెల్‌యేతర, యూదుయేతర ప్రయాణికులను విడుదల చేశారు. 100 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులను దాదాపు వారం పాటు ఎయిర్‌పోర్టులోనే బంధించారు. ఆ సమయంలో ఎయిర్‌ఫ్రాన్స్ విమాన కెప్టెన్, సిబ్బందిని హైజాకర్లు వెళ్లిపొమ్మని చెప్పినప్పటికీ.. ప్రయాణికులను విడిచి వెళ్లలేమని వారు కూడా బందీలుగా ఉండిపోయారు. వీరిని విడిపించేందుకు ఇజ్రాయెల్ దౌత్య మార్గాల్లో, ప్రయత్నించినప్పటికీ అవి ఫలించలేదు. దీంతో సైనిక ఆపరేషన్ అనివార్యమైంది.

### * కార్లతో మభ్యపెట్టి.. 'సైలెంట్'గా ఎంట్రీ ఇచ్చి..

బందీలను విడిపించేందుకు ఇజ్రాయెల్ సైనికపరంగా సన్నద్ధమైంది. కానీ, వారిని ఎక్కడ దాచిపెట్టారు? అక్కడకు ఎలా వెళ్లాలనే దానిపై వారికి సమాచారం లేదు. ఉగాండా ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి సాయం అందదని అప్పటికే తేలిపోయింది. దీంతో ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్ రంగంలోకి దిగింది. బందీలు ఉన్న ఎయిర్‌పోర్టును నిర్మించింది ఇజ్రాయెల్ కన్‌స్ట్రక్షన్ సంస్థే అని తెలుసుకుని దాంతో చర్చలు జరిపింది. టెర్మినల్, ఇతర కట్టడాల గురించి సమాచారం సేకరించి పక్కాగా ప్లాన్ చేసింది.




# విప్రోలో బెంచ్ 180 రోజులు!

## ఫ్రెషర్లకు బదులుగా అనుభవజ్ఞులనే తిరిగి వాడుకునే యోచన

పలు ఐటీ కంపెనీలు ఉద్యోగుల బెంచ్ సమయాన్ని (ప్రాజెక్టులో భాగం కాకుండా సంస్థలో ఉండే కాలం) తగ్గిస్తుండగా.. విప్రో మాత్రం ఇందుకు భిన్నంగా ఈ సమయాన్ని పెంచుతోంది. అక్టోబరు 1 నుంచి బ్యాండ్ 2, అంతకంటే తక్కువ శ్రేణిలోని జూనియర్, మిడ్ లెవల్ ఉద్యోగులు ఆరు నెలల (180 క్యాలెండర్ రోజుల) వరకు బెంచ్‌పై ఉండేందుకు విప్రో అనుమతినివ్వనుందని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. 'ఒక ఉద్యోగి బిల్ చేయదగిన ప్రాజెక్టు నుంచి విడుదలైన రోజు లేదా మరో బిల్ చేయదగిన ప్రాజెక్టుకు కేటాయించకుండా ఆన్‌సైట్ అసైన్‌మెంట్ నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన రోజు' నుంచి 180 రోజుల వరకు అనుమతిస్తారు. 180 రోజుల్లోపు కూడా ప్రాజెక్టు కేటాయింపు పొందలేని బ్యాండ్ 2/అంతకంటే తక్కువ శ్రేణిలోని ఉద్యోగులను 'ఉద్యోగ ఒప్పంద నిబంధనలకు' అనుగుణంగా కంపెనీ తొలగించొచ్చు. నైపుణ్యాలున్నా, ఏదైనా కారణాల వల్ల బెంచ్‌పై ఉన్న ఉద్యోగులను పోగొట్టుకోకుండా, తిరిగి నియమించుకోవడానికి కంపెనీకి తాజా మార్పు ఉపకరించనుంది. ఇటీవలి త్రైమాసికాల్లో ఫ్రెషర్ల నియామకాలు జరపనందున, అనుభవజ్ఞులైన సిబ్బంది వినియోగానికీ ఇది ఉపయోగపడనుంది. బెంచ్‌పై ఉన్న ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, అందుబాటులోని ప్రాజెక్టులకు బదిలీ చేయొచ్చు. దీనివల్ల కొత్త వారికి శిక్షణ ఇచ్చేందుకు పట్టే సమయం, వ్యయాలు తగ్గుతాయి. విప్రో ఎక్స్‌టెండెడ్ బెంచ్ లీవ్ ప్రోగ్రామ్‌ను వ్యతిరేకిస్తూ కార్మిక కమిషనర్‌ను కొందరు ఉద్యోగులు ఆశ్రయించినట్లు సమాచారం.

**ఇతర ఐటీ కంపెనీల్లో..**

ఇతర పెద్ద ఐటీ కంపెనీలు బెంచ్ సమయాన్ని 60 రోజుల నుంచీ కూడా తగ్గించాయి. టీసీఎస్




సవరించిన అసోసియేట్ డిప్లాయ్‌మెంట్ పాలసీ ప్రకారం.. ప్రతి ఉద్యోగి సంవత్సరానికి 225 రోజులకు బిల్లు వేయాలి. దీనివల్ల బెంచ్ సమయం గరిష్ఠానికి 35 పనిదినాలకు పరిమితం అవుతుంది. ఆరు సంవత్సరాల క్రితం కాగ్నిజెంట్ బిల్ చేయదగిన ప్రాజెక్టు లేని ఉద్యోగుల బెంచ్ సమయాన్ని 60 రోజుల నుంచి 35 రోజులకు తగ్గించింది.

**సాధారణంగా**

ఒక దిగ్గజ ఐటీ కంపెనీ మాజీ ఉద్యోగి వెల్లడించిన వివరాల ప్రకారం.. వెంటనే కొత్త అసైన్‌మెంట్ లేకుండా ప్రాజెక్టు ముగిసిన ఉద్యోగులను, 45 రోజుల (ఆయా కంపెనీల విధానంలోని రోజుల సంఖ్య ప్రకారం) వేతనంతో బెంచ్‌పై ఉంచుతారు. ఈ సమయంలో వారు జీతం పొందుతూనే ఉంటారు. నిర్దేశించిన సమయంలోనూ కొత్త ప్రాజెక్టు లభించకపోతే.. ఉద్యోగులు రాజీనామా చేయొచ్చు లేదా ఈబీఎల్‌పీ (అదనపు బెంచ్ లీవ్ కార్యక్రమం)ని ఎంచుకోవచ్చు. ఇది ప్రారంభంలో 90 రోజుల పాటు కొనసాగుతుంది. దీనిని మరో 30 రోజులు పొడిగించొచ్చు. ఈబీఎల్‌పీ అనేది జీతం లేని విరామకాలం. ఈ సమయంలో జీతం, పీఎఫ్ చెల్లింపులు నిలిచిపోతాయి. ఈబీఎల్‌పీ సమయంలో ఒక ప్రాజెక్టు లభిస్తే, ఆ ఉద్యోగికి దానిని కంపెనీ కేటాయించొచ్చు. అప్పుడు జీతం చెల్లింపు తిరిగి ప్రారంభం అవుతుంది.

# మన స్టాక్ మార్కెట్‌తో 'బాండ్' బ్యాటింగ్..!




పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. క్రూడాయిల్ ధరలు.. గత కొంతకాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్న అంశాలు. ఈ జాబితాలోకి కొత్తగా మరో అంశం చేరింది. అదే బాండ్ ఈల్డ్స్. అమెరికాలో బాండ్లపై పెరిగిన ప్రతిఫలాలు మన మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇంతకీ అమెరికాలో బాండ్ రాబడులు ఎందుకు పెరుగుతున్నాయ్? మనపై ప్రభావం ఎందుకు పడుతోంది? ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరల రూపంలో మన స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇటీవల కాలంలో మాత్రం అమెరికాలో బాండ్లపై ప్రతిఫలాలు మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ ప్రభావంతో గడిచిన ఎనిమిది వారాల్లో సెన్సెక్స్ 6,590 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 2,149 పాయింట్లు క్షీణించింది. దాదాపు రూ.26 లక్షల కోట్ల మదుపర్ల సంపద (బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్) ఆవిరైంది. అమెరికాలో 10 ఏళ్ల ట్రెజరీ బాండ్లపై రాబడులు 2007 తర్వాత తొలిసారి 5.31 శాతానికి చేరడం, 30 ఏళ్ల బాండ్లపై రాబడులు 5.65 శాతానికి పెరగడం (2002 తర్వాత గరిష్ఠ స్థాయి) ఇందుకు నేపథ్యం.

**ఎందుకు పెరుగుతున్నాయి?**

ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో నిధులను సేకరించడానికి బాండ్లను జారీ చేస్తాయి. సులభంగా చెప్పాలంటే, బాండ్ అనేది ఒక హామీ పత్రం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోకుండా, నేరుగా ప్రజల నుంచి, పెట్టుబడిదారుల నుంచి అప్పు తీసుకోవడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. అమెరికా ప్రభుత్వం కూడా వివిధ కాల వ్యవధులతో బాండ్లను జారీ చేస్తుంటుంది. వీటిని యూఎస్ ట్రెజరీ బాండ్లు అంటారు. వీటిపై వచ్చే రాబడులను ఈల్డ్స్‌గా వ్యవహరిస్తారు. అయితే, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలు ఉన్నాయి. పెరుగుతోన్న చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా.. దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగించొచ్చన్న అంచనాలు బలంగా ఉండటంతో బాండ్ ఈల్డ్స్ పెరుగుతున్నాయి. దీనికితోడు అమెరికా ప్రభుత్వం భారీగా రుణాలు తీసుకుంటుండడం, టెక్ కంపెనీలు సైతం ఏఐపై పెట్టుబడుల కోసం మూలధనం సమీకరణ కోసం పోటీ పడుతుండడం వల్ల కూడా బాండ్లపై రాబడులు పెరుగుతున్నాయి.

**మనపై ప్రభావం ఎందుకు?**

బాండ్లపై రాబడులు పెరిగితే ఈక్విటీ మార్కెట్లు సాధారణంగా ఒత్తిడిని ఎదుర్కొంటాయి. బాండ్లపై రాబడులు తగ్గినప్పుడు నిధులు ఈక్విటీ మార్కెట్లలోకి వస్తాయి. ప్రస్తుతం మన మార్కెట్ల విషయంలో జరుగుతున్నది ఇదే. అమెరికా ప్రభుత్వ బాండ్లలో రాబడి ఆకర్షణీయంగా మారినప్పుడు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రిస్క్ ఎక్కువగా ఉండే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకుంటారు. వాటిని అమెరికాలో ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ వైపు మళ్లించే అవకాశం ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మెరుగైన రాబడులు వచ్చినప్పుడు ఎలాగైతే మనం రిస్కు కలిగిన పెట్టుబడి సాధనాల జోలికి పోమో.. అదే తరహాలో అన్నమాట. పైగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తుండడంతో విదేశీ ఇన్వెస్టర్ల రాబడులు తగ్గుతాయి కాబట్టి వారు మార్కెట్లో అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే దేశీయంగా గత కొన్ని రోజులుగా ఎఫ్ఐఐలు పెద్దమొత్తంలో విక్రయాలకు దిగుతున్నారు. ఈ వారంలోనే రూ.34వేల కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు.

# సింగిల్ వేరియంట్‌లో శాంసంగ్ ఏ08.. ధర, ఫీచర్లు ఇవే!

దిల్లీ: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ శాంసంగ్ దేశీయంగా గెలాక్సీ ఏ08 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఎంట్రీలెవల్ స్మార్ట్‌ఫోన్ కోరుకునే వారి కోసం ఏ సిరీస్‌లో ఏటా కొత్త ఫోన్లను లాంచ్ చేస్తున్న శాంసంగ్.. ఏ07కు కొనసాగింపుగా దీన్ని తీసుకొచ్చింది. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ప్రధాన కెమెరా వంటి ఫీచర్లతో తీసుకొచ్చారు. ఇది కేవలం 4జీకి మాత్రమే సపోర్ట్ చేస్తుంది. పైగా కేవలం 4జీబీ+ 64జీబీ వేరియంట్‌లోనే లభ్యమవుతుంది. దీని ధరను రూ.18,499గా నిర్ణయించింది. డార్క్‌బ్లూ, గ్రీన్, సిల్వర్ రంగుల్లో లభిస్తుంది. శాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ రిటెయిల్ స్టోర్లతో పాటు, శాంసంగ్.కామ్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో కొనుగోలు చేయొచ్చు. ఆరేళ్లపాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది.

**ఫీచర్లు ఇవే..**

* 6.7 అంగుళాల హెచ్‌డీ+ పీఎల్ఎస్ ఎల్‌సీడీ ప్యానెల్
* 90Hz రిఫ్రెష్ రేటు
* మీడియాటెక్ హీలియో జీ99+ ప్రాసెసర్
* మైక్రో ఎస్‌డీ కార్డు ద్వారా 2టీబీ వరకు స్టోరేజీ పెంచుకునే వీలు
* శాంసంగ్ నాక్స్ సెక్యూరిటీ
* 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ డెప్త్ సెన్సర్
* 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా




* 25W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం
* ముందువైపు కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్
* ఐపీ64 డస్ట్, స్ప్లాష్ రేటింగ్




# టెస్ట్ కల తీరకుండానే.. రెడ్‌బాల్ క్రికెట్‌కు చాహల్ గుడ్‌బై

టీమ్ఇండియా జాతీయ జట్టులో మళ్లీ చోటు దక్కించుకోవడం కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తోన్న లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (Yuzvendra Chahal) కీలక నిర్ణయం తీసుకున్నాడు. రెడ్‌బాల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు ఇన్‌స్టాలో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. భారత్ తరఫున టెస్టుల్లో (Tests) ఆడాలన్న తన కల నెరవేరకుండానే.. అతడు ఈ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. "నేను మొదటిసారి ఎర్ర బంతిని ఎదుర్కొన్నప్పుడు నా వయసు పదేళ్లు. ఈ గేమ్‌తో ఇంతలా ప్రేమలో పడతానని అప్పుడు కనీసం ఊహించలేదు. రెడ్ బాల్ క్రికెట్ అంటే కేవలం ఒక ఫార్మాట్ మాత్రమే కాదు.. గంటల తరబడి సహనంతో ఉండటం, పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదగడానికి అర్థమేంటో నేను ఈ ఫార్మాట్‌లోనే నేర్చుకున్నా. ఇక్కడ ప్రతి పరుగు కోసం చేసే పోరాటం ఎంతో ఆనందాన్నిచ్చింది.



చివరిసారిగా నేను లార్డ్స్‌లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాను. టెస్టు క్యాప్ ధరించడం నా కల. దాని కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశా. అది నెరవేరలేదు. కానీ, ఈ ఫార్మాట్‌లో వచ్చిన ప్రతి అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించా. ఈ ఎర్రబంతి నాకు ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలను మిగిల్చింది" అని చాహల్ రాసుకొచ్చాడు. "దేశం కోసం ఆడాలన్న నా తపన ఇంకా సజీవంగానే ఉంది. వన్డేలు, టీ20 ఫార్మాట్‌లో అవకాశం కోసం అన్ని శాయశక్తులా ప్రయత్నిస్తా" అని చాహల్ వెల్లడించాడు. 2009లో చాహల్ హరియాణా తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఈ ఫార్మాట్‌లో 49 మ్యాచ్‌లు ఆడి.. 148 వికెట్లు తీశాడు. తన 17 ఏళ్ల కెరీర్‌లో 72 వన్డేలు, 80 టీ20లకు ప్రాతినిధ్యం వహించిన ఈ లెగ్ స్పిన్నర్‌కు ఇప్పటివరకు టెస్టుల్లో ఆడే అవకాశం లేదు. అంతేకాదు.. ఫిట్‌నెస్, ఇతరత్రా కారణాలతో జాతీయ జట్టుకు దూరమయ్యాడు. చివరిసారిగా 2023లో వెస్టిండీస్‌తో జరిగిన అంతర్జాతీయ టీ20 సిరీస్‌లో కన్పించాడు.

# ఆసియా క్రీడలు.. భారత్ పసిడి 'పట్టు'.. గోల్డెన్ 'పంచ్'

ఆసియా క్రీడల్లో పదమూడో రోజు భారత్‌కు పసిడి పతకాల పంట పండింది. బాక్సర్లు, రెజ్లర్లు అదరగొట్టడంతో ఇవాళ నాలుగు గోల్డ్ మెడల్స్ భారత్ సొంతమయ్యాయి. ఆర్చరీలోనూ ఓ బంగారు పతకం వచ్చింది. దీంతో పతకాల పట్టికలో భారత్ ఐదో స్థానానికి చేరుకుంది. తొలుత లవ్లీనా మొదలు పెట్టగా.. తాజాగా పర్వీన్, సుజీత్, అంకుష్ సత్తా చాటారు. కేవలం అర గంట వ్యవధిలో భారత్ మూడు స్వర్ణాలను నెగ్గింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 75 పతకాలు ఉండగా.. వీటిలో 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయి.

**తొలుత లవ్లీనా.. ఆ తర్వాత పర్వీన్**

భారత మహిళా బాక్సర్లు లవ్లీనా, పర్వీన్ హుడా బంగారు పతకాలు గెలిచారు. తొలుత 75 కేజీల విభాగంలో చైనాకు చెందిన బావో జియిని లవ్లీనా ఓడించింది. దీంతో ఆసియా క్రీడల్లో బాక్సింగ్ విభాగంలో స్వర్ణం సాధించిన రెండో భారత మహిళా బాక్సర్‌గా నిలిచింది. తర్వాత 65 కేజీల విభాగంలో పర్వీన్ చైనీస్ తైపీ బాక్సర్ నీన్ చిన్ చెన్‌ను 32 తేడాతో ఓడించింది. పురుష బాక్సర్ అంకుష్ 80 కేజీల విభాగంలో అదరగొట్టాడు. ఫైనల్‌లో 40 తేడాతో తన ప్రత్యర్థి దక్షిణ కొరియాకు చెందిన కిమ్ మిన్‌సూయింగ్‌పై విజయం సాధించాడు.

**రెజ్లింగ్‌లో సూపర్ పట్టు..**

రెజ్లర్ సుజీత్ సూపర్ పట్టుతో బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ఆరంభంలో ఒలింపిక్ ఛాంపియన్, తజకిస్థాన్‌కు చెందిన కుదీవ్ పైచేయి సాధించాడు. ఆ తర్వాత సుజీత్ పుంజుకొని.. తజికిస్థాన్ రెజ్లర్‌ను దెబ్బ కొట్టాడు. చివరికి 109 తేడాతో సుజీత్ పైచేయి సాధించి స్వర్ణం గెలిచాడు.

**సెపక్‌తక్రాలో కాంస్యం..**

భారత సెపక్‌తక్రా జట్టుకు కాంస్య పతకం వచ్చింది.




సెమీస్‌లో భారత్‌పై జపాన్ విజయం సాధించింది. దీంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌కే పరిమితమైన భారత్ కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇవాళ మహిళా హాకీ ఫైనల్ జరగనుంది. షెడ్యూల్ ప్రకారం 3.30 గంటలకు మొదలవ్వాలి. కానీ, జట్టు వచ్చే దారిలో రోడ్డు ప్రమాదం కారణంగా.. 45 నిమిషాల ఆలస్యంగా ప్రారంభం కానుంది.

# బాక్సింగ్‌లో మరో స్వర్ణం.. ఈసారి పర్వీన్ హుడా వంతు



ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణం వరించింది. మహిళల 65 కేజీల విభాగంలో పర్వీన్ హుడా అద్భుత ప్రదర్శనతో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఫైనల్‌లో చైనీస్ తైపీకి చెందిన నీన్ చిన్ చెన్‌ను 32 తేడాతో ఓడించింది. దీంతో ఆసియా క్రీడల బాక్సింగ్‌లో స్వర్ణ పతకం నెగ్గిన మూడో బాక్సర్‌గా నిలిచింది. మేరీకోమ్, లవ్లీనా తర్వాత పర్వీన్ దక్కించుకుంది. ప్రస్తుతం ఆసియా క్రీడల్లో బాక్సింగ్‌లో ఇది ఐదో పతకం. ఇందులో రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలు ఉన్నాయి. మొత్తం భారత్ 73 పతకాలతో ఆరో స్థానంలో ఉంది.






# వరల్డ్ కప్ ఫార్మాట్ పాక్‌కు నచ్చుతుంది

**: భారత మాజీ క్రికెటర్ ట్రోలింగ్**

సరిగ్గా ఏడాది తర్వాత వన్డే ప్రపంచ కప్ 2027 మెగా టోర్నీ ప్రారంభమవుతుంది. ఇప్పటికే షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తోన్న ఈ టోర్నీ ఫార్మాట్ గతం కంటే భిన్నంగా ఉంది. దీనిపై భారత మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ స్పందిస్తూ పాకిస్థాన్ జట్టును ట్రోల్ చేశాడు. "ప్రపంచ కప్ షెడ్యూల్, ఫార్మాట్‌ను చూసి తమ మైండ్‌సెట్‌కు అనుగుణంగా ఒక్కో జట్టు.. ఒక్కో రకంగా ఆలోచిస్తుంది. భారత్ (Team India) తప్పనిసరిగా కనీసం సెమీస్ వరకైనా ఎలాంటి అడ్డంకులు లేకుండా చేరుకుంటామని అనుకుంటుంది. అదే పాకిస్థాన్ ఆలోచన వేరేలా ఉంటుంది.. 'మా జట్టు సూపర్ 7కి కచ్చితంగా చేరుకుంటుంది.. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం' అనుకుంటుంది. ఇప్పుడీ షెడ్యూల్ చూశాక కచ్చితంగా పాక్ సంతోషపడుతుంది. హమ్మయ్య.. తాము రెండో రౌండ్‌కు వెళ్తామని వారు భావిస్తారు" అని పార్థివ్ అన్నాడు. ఇటీవల పాక్ జట్టు దారుణ ప్రదర్శనను చూసి ఈ వ్యాఖ్యలు చేశాడు. ఇక సెమీస్‌కు చేరే నాలుగు జట్లేవో కూడా పార్థివ్ అంచనా వేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌కు కష్టమేనని తెలిపాడు. భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌కు అవకాశం ఉందని వెల్లడించాడు.

**వరల్డ్ కప్ ఫార్మాట్ ఇలా..**

* వన్డే ప్రపంచ కప్ 2027 అక్టోబర్ 7 నుంచి మొదలవుతుంది. గత ఫైనలిస్టులు భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్‌తోనే ఈ సమరం ప్రారంభమవుతుంది.
* అంతకుముందు క్వాలిఫయర్స్, సూపర్ సిరీస్ ద్వారా నాలుగు టీమ్‌లు ప్రధాన టోర్నీకి అర్హత సాధిస్తాయి. అప్పుడు 12 టీమ్‌లు రెండు గ్రూప్‌లుగా విడిపోతాయి. ఈ స్టేజ్‌లో టాప్ 3లో నిలిచిన ఆరు టీమ్‌లతోపాటు అత్యుత్తమ నాలుగో జట్టు సూపర్ 7లో తలపడతాయి. గ్రూప్ స్టేజ్‌లోని పాయింట్లు సూపర్ 7కి యాడ్ కావు.
* సూపర్ 7లో ఏడు జట్లూ మిగతా టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. టాప్ 4లో నిలిచే జట్లు సెమీస్‌కు చేరతాయి. అక్కడ తలపడి ఫైనల్‌లో అడుగు పెడతాయి. తుదిపోరులో ఎవరు గెలిస్తే వారిదే వన్డే ప్రపంచ కప్.
* ఈసారి కూడా భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. వచ్చే వరల్డ్ కప్‌లో కనీసం రెండుసార్లు ఇరు జట్లూ తలపడతాయి. గ్రూప్ స్టేజ్‌లో ఒకసారి కాగా.. మరోసారి సూపర్ 7లో ఆడతాయి. సెమీస్ లేదా ఫైనల్‌లోనూ ఢీకొనే అవకాశం లేకపోలేదు.

# టైటిల్ మారిస్తే మంచిదేమో

ప్యారడైజ్, డోరతీ సక్సెస్‌ల తర్వాత మరో వెరైటీ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది కీర్తి సురేష్. తమిళంలో సత్యవాన్ సావిత్రి పేరుతో ఓ సినిమా చేసింది. కోర్ట్ రూమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీని నవంబర్ 20న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ఈ సినిమా తెలుగు వెర్షన్ టైటిల్‌పై మాత్రం విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. సత్యవాన్ సావిత్రి అంటే అర్థం తమిళ ఆడియెన్స్‌కు తెలుస్తుంది. కానీ తెలుగు ఆడియెన్స్ ఈ టైటిల్‌కు ఎలా కనెక్ట్ అవుతారని విమర్శలు గుప్పిస్తున్నారు. తెలుగు టైటిల్ ఛేంజ్ చేయడం మంచిదంటూ కామెంట్లు పెడుతోన్నారు. కాగా ఈ మూవీకి ప్రవీణ్ కే విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు.



# తీవ్రంగా గాయపడిన నుష్రత్

విహారయాత్ర కోసం విదేశాలకు వెళ్లిన బాలీవుడ్ హీరోయిన్ నుష్రత్ బరుచా ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమె వెన్నుముక ఫ్రాక్చర్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం బాలీవుడ్‌లో నాలుగు సినిమాలు చేస్తోంది నుష్రత్. ఈ బిజీ షెడ్యూల్స్‌కు బ్రేక్ ఇచ్చిన ఈ బ్యూటీ ఇటీవలే వెకేషన్ కోసం ఇండోనేషియాలోని బాలి వెళ్లింది. అక్కడ జరిగిన ఓ ప్రమాదంలో నుష్రత్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెన్నుముక ఫ్రాక్చర్ అయినట్లు ఆమె టీమ్ ప్రకటించింది. మరికొన్ని చోట్ల ఆమెకు గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం బాలిలోనే ఓ హాస్పిటల్‌లో ఆమెకు ట్రీట్‌మెంట్ జరుగుతోంది. దీనిపై ఆమె టీమ్ క్లారిటీ ఇచ్చింది. "నుష్రత్ ఆరోగ్యమే మాకు ముఖ్యం. అవసరమైన వైద్య సహాయం అందేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గాయం తీవ్రత ఎక్కువ ఉండటం.. సర్జరీ కారణంగా నుష్రత్‌కు కొద్ది రోజులు విశ్రాంతి అవసరమవుతుంది. ఈ ప్రమాదం కారణంగా కొద్ది వారాలు ఆమె సినిమాలకు దూరంగా ఉండబోతుంది" అంటూ ప్రకటించారు.





# నాగచైతన్యకు జోడీగా

వృషకర్మ తర్వాత అక్కినేని హీరో నాగచైతన్య టైమ్ ట్రావెల్ లవ్‌స్టోరీతో నెక్ట్స్ సినిమా చేయబోతున్నాడు. బెదురులంక ఫేమ్ క్లాక్స్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో ఆకాశంలో ఒక తార సినిమా చేస్తోంది ఈ అమ్మడు. ఈ మూవీతోనే టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టబోతుంది. తొలి సినిమా రిలీజ్ కాకముందే ఈ బంపరాఫర్ అందుకుంది. సాత్విక కంటే ముందు రుక్మిణి వసంత్‌ను అనుకున్నప్పటికీ వరుస డిజాస్టర్ల ఎఫెక్ట్‌తో ఆమెను పక్కనపెట్టారు. మిస్టిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. నవంబర్‌లో వృషకర్మ థియేటర్లలోకి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది.



# డైరెక్టర్‌గా శృతి హాసన్ ?

విశ్వనటుడు కమల్ హాసన్ తనయ శృతి హాసన్ త్వరలోనే మెగాఫోన్ పట్టబోతున్నట్లు ప్రచారం. లేడీ ఓరియెంటెడ్ థ్రిల్లర్ మూవీని తెరకెక్కించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. యంగ్ హీరోయిన్ల దూకుడుతో శృతి హాసన్‌కు అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. 2023లో రిలీజైన ప్రభాస్ సలార్ తర్వాత హీరోయిన్‌గా ఒక్క సినిమా కూడా చేయలేదు. గత ఏడాది కాలంగా థ్రిల్లర్ కథతో శృతి హాసన్ ఓ స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తోన్నట్లు తెలిసింది. లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో వెరైటీ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ సినిమాకు శృతి హాసన్ స్వయంగా దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. ఇందులో హీరోయిన్‌గా కోలీవుడ్ టాప్ స్టార్ నటించనున్నట్లు చెబుతోన్నారు. కేవలం డైరెక్షన్‌పై మాత్రమే ఫోకస్ పెట్టాలని ఈ సినిమాలో నటించకూడదని శృతి హాసన్ నిర్ణయించుకున్నట్లు చెబుతోన్నారు. లిమిటెడ్ బడ్జెట్‌లో ప్రయోగాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాకు డైరెక్టర్‌గానే కాకుండా మ్యూజిక్ కూడా కమల్ తనయ అందించబోతున్నట్లు సమాచారం. కూతురు సినిమాకు తండ్రి కమల్‌హాసన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించనున్నట్లు వార్తలొస్తున్నాయి.

## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| నెట్‌ఫ్లిక్స్ : | రొమాంచకం (తెలుగు)<br>లవ్ వెబ్ సిరీస్ (తమిళ్)<br>ఓ మై డాగ్ (హిందీ)<br>డూయింగ్ లైఫ్ (ఇంగ్లీష్)<br>డెమాన్ స్లేయర్ (జపనీస్) |
| అమెజాన్ ప్రైమ్ వీడియో: | సర్దార్ 2 (తమిళ్)<br>మహేంద్రగిరి వారాహి (తెలుగు) |
| జీ 5 ఓటీటీ: | పూజా మేరీ జాన్ (హిందీ)<br>మదర్ ప్రామిస్ (కన్నడ)<br>మడగాస్కర్ (ఇంగ్లీష్)<br>పంథడిక్కమ్ వెబ్‌సిరీస్ (మలయాళం) |
| ఆహా ఓటీటీ: | ధూళ్‌పేట్ (తెలుగు) |
| జియో హాట్ స్టార్: | బాంబే స్టోరీస్ (హిందీ)<br>మెయిన్ లడేగా (హిందీ)<br>బెత్లెహం కుడుంబయూనిట్ (మలయాళం)<br>వార్ (ఇంగ్లీష్) |

# తెలుగు వెర్షన్‌లోకి హనుమాన్ అంశ్



బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మైథాలజీ మూవీ హనుమాన్ అంశ్ తెలుగులోకి వచ్చేస్తోంది. ఈనెల 9న తెలుగు వెర్షన్ థియేటర్లలోకి రాబోతున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. త్రివిక్రమ్ ఆదర్శ కుటుంబం సినిమాకు పోటీగా హనుమాన్ అంశ్ రిలీజ్ కానుండటం ఆసక్తికరంగా మారింది. స్టార్స్ ఎవరూ లేకుండానే కేవలం రెండు కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మైథాలజీ మూవీ ఏకంగా 400 కోట్ల వసూళ్లను దక్కించుకుంది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా రూపొందిన ఈ మూవీలో శోభినవ్ సత్య టైటిల్ పాత్రలో కనిపించారు. చందన్ కే ఆనంద్, పూర్ణిమ తివారీ, అనిల్ రస్తోగి కీలక పాత్రల్లో అలరించారు. ఈ మూవీకి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు.